స్థానికులకు ఉపాధి ఏది?

హెచ్‌పీసీఎల్ విస్తరణ పనుల్లో స్థానికేతరులకే పెద్దపీట

- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కార్మిక సంఘాలు
- రిజిస్ట్రేషన్ లేకున్నా హడావుడి
- నాయకులకు కాసుల పంట


ఐఎంసీ గేటు ఎదురుగా విస్తరణ పనులలో పాల్గొన్న స్థానికేతర కార్మికులు

మల్కాపురం: హెచ్‌పీసీఎల్‌లో జరుగుతున్న విస్తరణ పనులు నాయకులకు కాసుల పంట పండిస్తుండగా.. నిరుద్యోగులకు పస్తులు తప్పడం లేదు. పారిశ్రామిక ప్రాంతంలో అతి పెద్ద కర్మాగారం అయిన హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ)లో మూడేళ్ల నుంచి సుమారు రూ.26 వేల కోట్లతో విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులు దాదాపు 90 శాతం పూర్తి కావచ్చాయి. వచ్చే నెలలో మరో పెద్ద ప్రాజెక్ట్ పనులు ప్రారంభం కానున్నట్టు తెలుస్తోంది. అప్పుడైనా ఉపాధి కల్పించాలని స్థానిక నిరుద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

వాగ్దానాలు నీటిమీద రాతలే...

విస్తరణ పనులు మొదలు పెట్టే ముందు సంస్థ యాజమాన్యం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. అధికారులు విస్తరణ పనుల్లో స్థానిక నిరుద్యోగులకు అధిక ప్రాధాన్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో సంస్థను ఆనుకుని ఉన్న పలు ప్రాంతాల నిరుద్యోగులు ఉపాధి లభిస్తుందని ఆశగా ఎదురు చూశారు. ఇదే అదునుగా భావించిన కొంత మంది గుర్తింపు లేని,గుర్తింపు ఉన్న ట్రేడ్ యూనియన్ పెద్దలు,నాయకులు ముందుకు వచ్చి మీకు ఉపాధి రాకుంటే ఉద్యమాలు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఊదరగొట్టారు.

శ్రమ దోపిడీ

స్థానిక కార్మికులైతే చట్టప్రకారం వేతనాలు చెల్లించాలి. ఇతర సదుపాయాలు కల్పించాలి. దీంతో కాంట్రాక్టర్లు బయట వారితో పని చేయించి శ్రమదోపిడీ చేస్తున్నారు. అయినా యూనియన్ నాయకులు మాత్రం నోరుమెదపడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికులకైతే అదనపు పని దినాలకు ఓటీ ఇలా పలు అలవెన్స్ ఇవ్వాల్సి ఉంటుందని స్థానికేతురులకు అధికంగా ఉపాధి అధిక అవకాశాలు కల్పిస్తున్నారు.

కాంట్రాక్టర్లతో బేరాలు

పనులు ప్రారంభమైన తర్వాత పలు యూనియన్ల నాయకులు కాంట్రాక్టర్లతో బేరాలు ఆడుకుని సొమ్ము చేసుకున్నారే తప్పా యువతను పట్టించుకోలేదు. విస్తరణ పనుల ముందు వరకు పారిశ్రామిక ప్రాంతంలో కేవలం 5 నుంచి 7 ట్రేడ్ యూనియన్లు ఉండేవి. నేడు అవి 32 వరకు పెరిగాయి. ఇన్ని యూనియన్లు వచ్చినా స్థానిక నిరుద్యోగులకు మాత్రం అనుకున్నంత ఉపాధి అవకాశాలు రాలేదు. ఉన్నత చదువులు చదివిన వారితో పాటు సాంకేతిక పరంగా అనుభవం ఉన్న యువత ఉన్నా ఉపాధి దక్కలేదు. వీరిని కాదని కాంట్రాక్టర్లు బీహార్,ఉత్తర ప్రదేశ్ వంటి ప్రాంతాల నుంచి కార్మికులను తీసుకువచ్చి పనులు చేయిస్తున్నారు.


హెచ్‌పీసీఎల్ ముఖ ద్వారం

ప్రదక్షిణ చేసినా ఫలితం లేదు



హెచ్‌పీసీఎల్ సంస్థ కోసం మా భూములు ఇచ్చాం. అయిన విస్తరణ పనుల్లో కనీసం కాంట్రాక్ట్ పనిలో చేరలేని పరిస్థితి. వెల్డర్‌గా నాకు 20 ఏళ్ల అనుభవం ఉంది. అయినా ఏ కాంట్రాక్టర్ ట్రేడ్ యూనియన్ నాయకుడు గానీ ఉపాధి కల్పించలేదు. అనుభవం ఉంది... ఉపాధి కల్పించాలని హెచ్‌పీసీఎల్ గేటు చుట్టూ ప్రదక్షిణ చేసినా ఎవరూ పట్టించుకోలేదు. నాలాంటి వారు రోడ్డున తిరుగుతున్నారు.

–బొట్ట సైదన్న, మల్కాపురం గొల్లవీధి

15 ఏళ్ల అనుభవం ఉంది

కలాసీగా,రిగ్గర్‌గా వివిధ సంస్థల్లో సుమారు 15 సంవత్సరాలకు పైగా పని చేసిన అనుభవం ఉంది.విస్తరణ పనుల్లో కలాసీ లేదా రిగ్గర్‌గా లేదా కనీసం హెల్పర్‌గా నైనా ఉపాధి అవకాశం కల్పించాలని ట్రేడ్ యూనియన్ నాయకులతో పాటు కాంట్రాక్టర్‌ను వేడుకున్నాను. అయినా ఫలితం లేదు.



– రాజారావు, మల్కా పురం, మార్కెట్ లైన్

ఇతర ప్రాంతాల్లో పనికి వెళ్తున్నా..



వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వచ్చిన వారు మా ఊరిలో ఉపాధి పొందుతున్నారు. మాకు అవకాశం లేక పోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్తున్నాను. కార్పెంటర్‌గా 35 ఏళ్ల అనుభవం ఉంది. విస్తరణ పనుల్లో కలాసీగా నైనా ఉపాధి అవకాశం కల్పించాలని రెండేళ్ల నుంచి కాంట్రాక్టర్లు, యూనియన్ నాయకుల చుట్టూ తిరిగాను.ఫలితం లేకపోవడంతో భీమిలి,కూర్మన్నపాలెం,అనకాపల్లి వంటి ప్రాంతాల్లో పనులకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది.

–అప్పలరాజు, మల్కాపురం, పల్లివీధి

బాల్య వివాహాలతో అనర్థాలు


ప్రతిభ చూపిన వారికి జ్ఞాపికలు అందిస్తున్న అతిథులు

మల్కాపురం: బాల్య వివాహాలు,బాల కార్మిక వ్యవస్థ,బాలల అక్రమ రవాణా,బాలలపై జరిగే హింస మొదలైన సమస్యల పరిష్కారానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మానవ హక్కుల కౌన్సిల్ వ్యవస్థాపక కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో బుధవారం బాలల హక్కుల పరిరక్షణ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అతిథిగా పాల్గొన్న శ్యాంప్రసాద్ మాట్లాడుతూ బాల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వాలు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. చిన్నారులు కూడా జీవితంలో స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగాలని.. క్రమశిక్షణ, పట్టుదల దేశభక్తి అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు పాటలు,చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీఎస్ ప్రోగాం జిల్లా నోడల్ అధికారి భాగ్యలక్ష్మి, వై.అనసూయాదేవి,గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయాలి


ర్యాలీలో ఎల్జీ పాలిమర్స్ ల్యాండ్ లూజర్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాంట్రాక్ట్ కార్మికులు

గోపాలపట్నం: ఎల్జీ పాలిమర్స్‌పరిశ్రమ నిలిచి పోవడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ల్యాండ్ లూజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు వెంకటాపురం గ్రామంలోని రామాలయం నుంచి ఆర్ ఆర్‌వెంకటాపురం జంక్షన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. గ్యాస్ లీకై ఐదేళ్లు దాటినా ఇందులో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు న్యాయం జరగలేదని వాపోయారు. ఉపాధి కోల్పోయి రోడ్డు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలిమర్స్ స్థానంలో ఎలక్ట్రానిక్ ఫ్యాక్టరీ ప్రారంభించి ఉపాధి కల్పించాలని కోరారు. లేని పక్షంలో పర్మినెంట్ ఉద్యోగుల మాదిరిగా సెటిల్‌మెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికులు, బాధితులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాలిమర్స్ మృతులకు ఘన నివాళి


కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

గోపాలపట్నం: ఎల్జీ పాలిమర్స్ బాధితుల సంఘం ఆధ్వర్యంలో గ్యాస్‌లీక్ ప్రమాదంలో మృతి చెందిన వారికి కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. గోపాలపట్నం జోన్ సీపీఎం నాయకుడు బలివాడ వెంకటరావు మాట్లాడుతూ ఈ ప్రమాదంలో అందరికీ తగిన న్యాయం జరగలేదని అన్నారు. బాధితులకు జీవిత కాల ఆరోగ్య కార్డులు అందివ్వాలని, జీవనాధార సహాయం పంపిణీలో అవకతవకలు జరిగాయని విమర్శించారు. కార్యక్రమంలో ఎల్జీ పాలిమర్స్ బాధితుల సంక్షేమ సంఘం నాయకులు శ్రీనివాసరావు, చంద్రశేఖర్, సత్యారావు, సీపీఎం జోన్ కార్యదర్శి బి. జగన్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజు, అజంతా పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

గాయాలతో ప్రత్యక్షమైన యువకుడు


చికిత్స పొందుతున్న శరణ్‌కుమార్

ఉక్కునగరం: వాకింగ్ కోసం రెండు రోజుల కిందట బయటకు వచ్చిన యువకుడు తీవ్ర గాయాలతో ప్రత్యక్షమయ్యాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. అగనంపూడి ప్రాంతానికి చెందిన సబ్బవరపు శరణ్‌కుమార్ (19) అనే యువకుడిని సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో స్నేహితులు ఉక్కునగరం లోని స్టేడియం సమీపంలోని వాకింగ్ ట్రాక్ వద్ద డ్రాప్ చేశారు . వాకింగ్ అనంతరం ఇంటికి వెళ్లాల్సిన ఆ యువకుడు కనిపించలేదు. శరణ్ కోసం వెతికిన తల్లిదండ్రులు కనిపించక పోవడంతో బుధవారం స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు గాలింపు చేపట్టగా అగనంపూడి ఆస్పత్రి రహదారిలో గాయాలతో దొరికాడు. అతన్ని గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అతనికి స్పృహ వస్తే గాని ఏం జరిగింది చెప్పలేమని పోలీసులు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హామీలు అమలు చేయాలని ఆటోడ్రైవర్ల ఆందోళన


ర్యాలీ చేస్తున్న ఆటో డ్రైవర్లు

జగదాంబ: ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి అన్నారు. బుధవారం సరస్వతీ పార్కు వద్ద ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం డ్రైవర్లకు వాహనమిత్ర ద్వారా రూ. 15 ఇవ్వాలన్నారు. 21, 31 జీవో రద్దు చేయాలన్నారు. పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర వస్తువులు, విద్యుత్ చార్జీలు తగ్గించాలన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 20న తలపెట్టిన రాష్ట్రవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, శ్రీనివాస్, జోగారావు, నూకప్పారావు, నూరిబాబు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ముగ్గురు హెడ్ నర్సులకు పదోన్నతులు


ఉత్తర్వులు అందజేస్తున్న డాక్టర్ రాధారాణి

మహారాణిపేట: ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్ పోస్టుల కోసం బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. హెడ్ నర్సులుగా పని చేస్తున్న ముగ్గురికి గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్లుగా పదోన్నతులు లభించాయి. డి.కవిత (రీజినల్ కంటి ఆస్పత్రి), జి.చంద్రిక (పాడేరు ప్రభుత్వ ఆస్పత్రి), ఎం.ఇందిర (పాడేరు ప్రభుత్వ ఆస్పత్రి)లకు పోస్టింగులు ఇస్తూ వైద్యారోగ్య శాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ రాధారాణి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా అధ్యక్షురాలు భవానీ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెనోటీసు అందజేత


హెచ్‌పీసీఎల్ అధికారికి సమ్మె నోటీసు ఇస్తున్న భోగవల్లి నాగభూషణం

మల్కాపురం: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందని..., ప్రభుత్వ రంగ పరిశ్రమలను కార్పొరేటర్ సంస్థలకు అప్పగిస్తుందని ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం ఆరోపించారు. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20న దేశ వ్యాప్తంగా చేయనున్న సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు సమ్మె నోటీసును హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) సీనియర్ సెక్యూరిటీ మేనేజర్ విజయకుమార్‌కు బుధవారం అందించారు. అనంతరం మల్కాపురం వద్ద జరిగిన కార్యక్రమంలో భోగవల్లి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీ కరణ చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ రంగ పరిశ్రమలను కాపాడాల్సిన వారు ఇలాంటి చర్యలు చేపట్టడం దారుణం అన్నారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న చర్యలను చంద్రబాబు,పవన్‌కల్యాణ్ వ్యతిరేకించకపోవడం దారుణమన్నారు.తాము అధికారంలోకి వస్తే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా చూస్తామని హామీలు ఇచ్చి,నేడు ఆ హామీలను గాలికి వదిలేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.

ఎన్‌ఏడీ స్థలంలో చొరబాటు!

విశాఖ విద్య: రక్షణ శాఖ ఆధ్వర్యంలోని నేవల్ ఆర్మ్‌డ్ డిపో(ఎన్‌ఏడీ) స్థలంలోకి కొంతమంది చొరబడుతున్నారు. ఎయిర్‌పోర్టుకు వెళ్లే దారిలో సాకేతపురం వద్ద ఎన్‌ఏడీ నిర్మించిన రక్షణ గోడను కొంతమంది కూల్చేసి తమ సొంత అవసరాలకు వినియోగిస్తున్నారు. కేంద్ర రక్షణ విభాగానికి చెందిన స్థలం నిషేధిత ప్రాంతమైనప్పటికీ ఆక్రమణలకు పాల్పడుతుండడం గమనార్హం. సాకేతపురంలో కొంతమంది బహుళ అంతస్తుల భవన నిర్మాణ సామగ్రిని నిల్వ చేసేందుకు ఎన్ఏడీ స్థలాన్ని వినియోగిస్తున్నారు. వీరికి కూటమి నేతలు అండదండలు ఉండటంతో తమ సొంత అవసరాలకు వినియోగిస్తున్నారని చెబుతున్నారు. తరచూ కాలనీల్లో పర్యటించే సచివాలయ సిబ్బంది సైతం తమకు సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన విలువైన స్థలాలు కూటమి నేతల అండతో ఎన్‌ఏడీ పరిసర ప్రాంతాల్లో ఆక్రమణకు గురవుతున్నాయని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎన్‌ఏడీకు చెందిన స్థల పరిరక్షణతో పాటు గోడ పటిష్టం చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.


కూల్చేసిన రక్షణ గోడ

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.


నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

దేశవ్యాప్త సమ్మె విజయవంతానికి పిలుపు

డాబాగార్డెన్స్: అఖిల పక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన మే 20 దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం జగదాంబ జంక్షన్ సమీపాన సిటు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ప్రధాని మోదీ ప్రభుత్వం కార్మికులను బానిసలుగా చేసి యాజమాన్యాలకు లాభం చేకూర్చే విధంగా రూపొందించిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలన్నారు. చట్టాల్లో మార్పులు చేయాలంటే పార్లమెంట్‌లోనే చేయాలి. కానీ లేబర్ కోడ్ల ద్వారా రాష్ట్రాలకు ఇష్టం వచ్చినట్టు మార్చే అధికారాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో సిటు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగభూషణం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మన్మథరావు, సీఎఫ్‌టీయూఐ జాతీయ అధ్యక్షుడు కనకారావు, ఏపీఎఫ్‌టీయూ నాయకుడు దేవా, ఏసీటీయూ నాయకుడు కె. శంకర్రావు, వైఎస్సార్‌టీయూసీ నాయకుడు అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని ఉద్యమం


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నర్సింగరావు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలనే డిమాండ్‌తో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. గాలి జనార్ధనరెడ్డి అక్రమ ఎగుమతి చేశారని న్యాయస్థానం జైలు శిక్ష విధించిందన్నారు. ఇది ఆనాటి బీజేపీ ప్రభుత్వం అండతోనే జరిగిందని ఆరోపించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు 35 ఏళ్లుగా సొంత గనులు కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. గాలితో పాటు పోస్కోకు సొంత గనులు కేటాయించడం దేశద్రోహమన్నారు. ఇప్పటికైనా సొంత గనులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాల్సి ఉందన్నారు. ఇందు కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించాల్సి ఉందన్నారు. సమావేశంలో స్టీల్ సీఐటీయూ అధ్యక్షుడు కె.ఎం. శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి యు. రామస్వామి పాల్గొన్నారు.

దువ్వాడ రైల్వేస్టేషన్ కిటకిట


దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

- గణనీయంగా పెరిగిన ప్రయాణికులు, ఆదాయం
- ప్రయాణికులు 19 శాతం, ఆదాయం 34 శాతం వృద్ధి

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌కు ప్రయాణికులు పోటెత్తుతున్నారు. పరిసర ప్రాంతాలు పారిశ్రామిక వృద్ధిలో దూసుకుపోవడం.. విద్యా సంస్థలు ఉండడంతో స్టేషన్ గుండా ప్రయాణించే వారి సంఖ్య పెరిగింది. దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులు, ఆర్జించిన ఆదాయం రెట్టింపు అయింది. 2023–24, 2024–25 ఆర్థిక సంవత్సరం గణాంకాల ప్రకారం దువ్వాడ రైల్వేస్టేషన్ ప్రయాణికులు, ఆదాయం పెరిగింది. అయితే అందుకు తగ్గట్టు వసతులు లేకపోవడంతో ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

- 2023–24 సంవత్సరంలో 7లక్షల 94వేల మంది ప్రయాణం చేయగా, ఆదాయం రూ.8 కోట్ల 29 లక్షలు ఆర్జించింది. అదే గడిచిన సంవత్సరం (2024–25)లో 9 లక్షల 43వేల మంది ప్రయాణికులు స్టేషన్ నుంచి ప్రయాణం చేయగా, రూ.11కోట్ల 11 లక్షలు ఆర్జించింది.
- గత రెండేళ్ల వృద్ధి రేటును పరిశీలిస్తే దువ్వాడలో ప్రయాణికులు 18.77శాతం పెరగగా, ఆదాయం మాత్రం 34.06 శాతం పెరుగుదలతో వాల్తేరు డివిజన్‌లో దూసుకుపోతుంది. అదే విశాఖ స్టేషన్ రెండేళ్లలో ప్రయాణికులు, ఆదాయం విషయంలో 4.44 శాతం, 4.20 శాతం పెరుగుదలతో సరిపెట్టుకుంది.
- సింహాచలం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల 6.95 శాతం పెరగగా, ఆదాయం మాత్రం మైనస్ 6.34 శాతానికి పడిపోయింది.

వసతులు వస్తే మరింత తాకిడి

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల తాకిడి రెట్టింపు అవుతోంది. అందుకు తగ్గట్టుగా అమృత భారత్ కార్యక్రమంలో పునరాభివృద్ధి పేరుతో అధునాత భవనాలు, విలాసవంతమైన హోటళ్లు, రెస్టారెంట్లు హంగులు, ఆర్భాటాలు చేస్తున్నారు. అయితే ఈ లోగా లిఫ్టులు, ఎక్స్‌లేటర్లు, మంచినీరు, సేదతీరడానికి రేకుల షెడ్లు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

న్యాయ సలహా కేంద్రాలపై అంగన్‌వాడీలకు అవగాహన

మద్రిపాలెం: న్యాయ సలహా కేంద్రాల ప్రాముఖ్యాన్ని ప్రజలకు వివరించే దిశగా అంగన్‌వాడీ కార్యకర్తలు భాగస్వామ్యం కావాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి, జిల్లా సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం అంగన్‌వాడీ టీచర్లకు ఉచిత న్యాయ సలహా కేంద్రాల్లో లభించే సేవలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు గృహ హింస, వేధింపుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రస్తుత ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించే విధంగా తీసుకొచ్చిన చట్టాలను సనద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సామాజిక భద్రత కల్పించడానికి భారత ప్రభుత్వం ఈ శ్రమ్ యోజనను ప్రారంభించిదన్నారు. వారి డేటాను సేకరించి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను అందించడానికి ప్రభుత్వం ఈ శ్రమ్ పోర్టల్‌ను కూడా ప్రారంభించిందని చెప్పారు. అసంఘటిత రంగంలో పనిచేసే ఏ వ్యక్తి అయినా ఈ శ్రమ్ కార్డ్ ఫారం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమాన్ని సీడీపీవోలు ఎం.వి.రమణకుమారి, ఎం .శ్రీలత పర్యవేక్షించారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ నరేష్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పిస్తున్న సివిల్ జడ్జి సన్యాసినాయుడు

అల్లూరి జీవితం స్ఫూర్తిదాయకం


అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్, ఆచార్యులు

విశాఖ విద్య: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుధవారం ఏయూ న్యాయ కళాశాల పక్కనే ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ పూలమాల వేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి జీవితం యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. విశాఖ జిల్లాతో అల్లూరికి ఎంతో అనుబంధముందని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం, డి.నాగరాజకుమారి, ప్రవేశాల సంచాలకులు డి.ఎ.నాయుడు, విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళి

ఎంవీపీకాలనీ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఎంవీపీ కాలనీ సెక్టార్–3 నివాసితుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. స్థానిక అల్లూరి విగ్రహానికి సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయని స్ఫూర్తితో యువత దేశానికి సేవలందించాలని పిలుపునిచ్చారు. సంఘ నాయకులు రవికుమార్, రవిశంకర్ రాజు, శ్రీను, వాసు, సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.